ఆత్మీయ బంధం

వడ్డాని

మన భారతీయ సంప్రదాయంలో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఎంతో ప్రత్యేకత ఉంది. జీవితాంతం కొనసాగే బంధాల్లో ఇది కూడా ఒకటి. ఆత్మీయమైన తోడునీడగా ఈ బంధాన్ని భావిస్తుంటారు. భారతీయ సంస్కృతిలో పలు సందర్భాల్లో సోదరీ సోదరుల అనుబంధం వ్యక్తమయ్యే సందర్భాలు ఉంటాయి.

అలాగే మన సంప్రదాయంలో ఇంట్లో తండ్రి తరువాత అంతటి ప్రాధాన్యత ఇంటి పెద్దకొడుకుకి, అంటే పెద్దన్నకి ఉంటుంది. ఎందుకంటే తండ్రి తదనంతరం ఆ ఐదువు బాధ్యతలు మోయటం, కుటుంబ గౌరవ మర్యాదల్ని నిలబెట్టాల్సిన బాధ్యత ఇవి- ఇంటి పెద్దకొడుక్కి ఉన్నట్లు భావిస్తారు.

అంటే ఇంట్లో తరువాతి పిల్లలకు అతను ఒక ఆదర్శంగా కూడా నిలుస్తాడు. ఇంటిల్లిపాది అవసరాలు గమనించి, వారి మంచి చెడు చూసేవాడు గానూ, అవసరమైనపుడు మంచి సలహాలు ఇచ్చి ఇంట్లో అందరి జీవితాలు సవ్యంగా సాగేందుకు సూచనలు చేసేవాడుగా కూడా అన్నకు మనకుటుంబాల్లో గౌరవం ఉంది.

ఆడపిల్ల ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, జీవితంలో తన బాగోగులు తానే చూసుకునే నేర్పు, సామర్థ్యాలు కలిగి ఉండేందుకు, అన్న తన వెన్నుదన్నుగా ఉన్నాడన్న ధైర్యం దోహదం చేస్తుంది.

ఉమ్మడి కుటుంబాల్లో ఉండే ఆనందం నేటి రోజుల్లో కేవలం చరిత్రగా మారిపోతున్నది. ఇదివరకటి రోజుల్లో అన్నంటే చెల్లెలికి నిజమైన రక్షకుడు. ఆమెకి తోడునీడగా ముందు నిలిచేవాడు. ఆమె మనసులోని అన్ని భావాలను చెప్పుకోదగిన స్నేహితుడు. అవసరమైనపుడు సలహా సహకారాలు తీసుకోదగిన ఏకైక నమ్మదగిన వ్యక్తి.

అయితే అప్పుడప్పుడు చిన్న తగవులు, మనస్పర్థలు మామూలే. కలిసిమెలసి పెరిగే తోబుట్టువుల మధ్య ఇవన్నీ మామూలే. ఇవన్నీ వారిరువురి బంధం ఆరోగ్యకరంగా ఎదిగేందుకు దోహదం చేసేవే.

ఇల్లుదాటి బయటకు వెళ్లినపుడు సొంతంగా ఏర్పడే అభిప్రాయాలు, నిర్ణయాలు ఇవన్నీ ఉంటాయి. ఇలాంటి సందర్భాలు ఒక అమ్మాయికి ఎదురైనపుడు వెంటనే గుర్తొచ్చే వ్యక్తి అన్న. ఒక వ్యక్తికి తాను ఇవాబుదారీని అనే నిజం ఆమెకి వెంటనే గుర్తు వస్తుంది. ఒక వ్యక్తి ఇంట్లో తనకోసం ఎదురు చూస్తుంటాడు. మంచిపని చేసినపుడు అభినందించి, ఉత్సాహపరుస్తూ, అదే తప్పుచేస్తే స్నేహంగా మందలిస్తూ సరియైన సూచనలు చేసేవాడు తోడబుట్టిన వాడే.

అన్న నిర్వర్తించే ఈ బాధ్యత చెల్లెలు ఆమాయకంగా ఏ ఆకర్షణలకు లొంగకుండా సవ్యమైన జీవన నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడుతుంది.

ఈ రోజున ఉమ్మడి కుటుంబాలు లేవు. ఇంట్లో ఒక్కరు ఇద్దరు కంటే పిల్లలు ఉండటం లేదు. అన్నగా ఇంతటి బాధ్యతలు నిర్వహించగల వ్యక్తి నేడు లభించడం అరుదుగా ఉంది. మంచి స్నేహితుల్లో ఇలాంటి లక్షణాలు ఉన్నవారు ఉన్నా, ఒక్క తోడబుట్టిన వారికి మాత్రమే మన గురించి పూర్తిగా తెలిసే అవకాశం ఉంటుంది. మన శక్తిసామర్థ్యాలు, బలహీనతలు, వ్యక్తిత్వ లక్షణాలు తోడబుట్టినవారికే తెలిసే అవకాశం ఉంటుంది.

□ వడ్డాని, వైల్డ్ ఎడ్యుకేషనిస్ట్, హైదరాబాద్

VAARTHA AUGUST 9, 2006.

LEADING TELUGU DAILY NEWS MAGAZINE.

INDIVIDUAL ARTICLE ON 'BROTHERHOOD'

ALL ABOUT HEALTHY RELATIONSHIP BETWEEN

BROTHERS AND SISTERS TOWARDS 'RAKHI FESTIVAL'.